MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
TS-bPASS
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ THE మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
బుధవారం 29 -04-2026 పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్



# మండుతున్న ఎండలు..!!

# భానుడిభగభగ..

# వడదెబ్బపై జాగ్రత్త!

- అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకం: మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్
- కలెక్టరేట్‌లో అంగన్‌వాడీలు, మున్సిపల్ సిబ్బందికి అవగాహన
- ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచన

- భగ్గుమంటున్న ఎండలు, ప్రజలు ఇళ్లకే పరిమితం
- ఎండదెబ్బ ముప్పు..పిల్లలు, వృద్ధులకు హెచ్చరిక
- మరికొన్ని రోజులు తీవ్ర ఎండలు కొనసాగనున్నట్లు అంచనా



## మర్రిగూడ మండలంలో

# ఆగని ఆలయాల దోపిడీలు



- దొంగల బీభత్సం, గుప్తనిధుల వేటగాళ్ల అరాచకం.
- యథేచ్ఛగా సాగుతున్న దేవాలయ భూముల ఆక్రమణ.
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న దేవాదాయ శాఖా అధికారులు



# దళారీ వ్యవస్థకు చెక్..


- అన్నదాతకు అండగా సహకార సంఘం!
- తిర్మలాపూర్‌లో అట్టహాసంగా వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం హాజరైన పలు గ్రామాల సర్పంచ్‌లు.

జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్): అన్నదాతల శ్రేయస్సే ప్రథమ లక్ష్యంగా అడుగులేస్తున్న 'తిర్మలాపూర్ రైతు పరస్పర సహకార సంఘం' మరో కీలక ముందడుగు వేసింది.

క్రైమ్ మిర్రర్

# మర్రిగూడ మండలంలో ఆగని ఆలయాల దోపిడీలు

మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):దొంగల బీభత్సం, గుప్త నిధుల తవ్వకాలతో భగవంతుడు కూడా భయపడే పరిస్థితి ఏర్పడింది.. ?నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల పరిధిలోని, పలు గ్రామాలలో వెలిసిన పురాతన, పవిత్ర దేవాలయాలు ప్రస్తుతం అసాంఘిక శక్తులకు నిలయాలుగా, దొంగల పాలిట కామధేనువులుగా మారుతుండటం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. గత కొంతకాలంగా మండలంలోని పలు గ్రామాల్లో, వరుసగా జరుగుతున్న దొంగతనాలు భక్తులను బెంబేలెత్తిస్తున్నాయి. దుండగులు ఏకంగా దైవ సన్నిధి అని కూడా చూడకుండా, ఆలయ తాళాలు పగలగొట్టి హుండీలను ఎత్తుకెళ్లడం, విలువైన గంటలు, మైక్ సెట్లు, పూజా సామాగ్రిని అపహరించు కుపోవడం నిత్యకృత్యంగా మారింది. ఈ వరుస దొంగతనాల వెనుక ఒక వ్యవస్థీకృత ముఠా ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ, పోలీసులు గానీ, దేవాదాయ శాఖ అధికారులు గానీ, ఇప్పటి వరకు ఒక్క నిందితుడిని కూడా పట్టుకోకపోవడం గమనార్హం.! కేవలం చిల్లర దొంగతనాలే కాకుండా, మండలంలోని చరిత్ర కలిగిన పురాతన ఆలయాల్లో, గుప్తనిధుల వేటగాళ్లు సాగిస్తున్న విధ్వంసం వర్ణనాతీతంగా ఉంది.అర్ధరాత్రి వేళల్లో యంత్రాలతో గర్భాలయాలను సైతం తవ్వి పోస్తూ, విగ్రహాలను ధ్వంసం చేస్తూ వారు సాగిస్తున్న అరాచకాలకు అడ్డుకట్ట వేసే నాథుడే కరువయ్యారు. విచారకరమైన విషయం ఏమిటంటే, ఒకవైపు దొంగల భయం వెంటాడుతుంటే, మరోవైపు గ్రామాల్లోని దేవుడి మాన్యం భూములు, రాజకీయ పలుకుబడి ఉన్న అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తున్నాయన్న ఆరోపణలు వినపడుతున్నాయి. వందల ఎకరాల దేవాలయ భూములు అక్రమ కట్టడాలకు, సాగుకు గురవుతున్నా, దేవాదాయ శాఖ రికార్డుల్లో ఉన్న భూములను, కాపాడటంలో అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. వరుసగా ఫిర్యాదులు అందుతున్నా, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపించడం, కనీసం ఆలయాలకు సెక్యూరిటీ గార్డులను నియమించకపోవడం కానీ సిసి




కెమెరాల ఏర్పాటుపై దృష్టి సారించకపోవడం, అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది. ఇటు దొంగల భయం, అటు భూ ఆక్రమణలు, మధ్యలో గుప్తనిధుల తవ్వకాలతో, పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రాలు తమ ఉనికిని కోల్పోతుంటే, పాలనా యంత్రాంగం నిద్రపోతోందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.? ప్రభుత్వం, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, ప్రత్యేక బృందాలతో దొంగలను పట్టుకోవాలని, ఆక్రమణకు గురైన దేవాలయ భూములను స్వాధీనం చేసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుని, పెద్ద ఎత్తున ఆందోళనలకు దారితీస్తుందని భక్తులు హెచ్చరిస్తున్నారు..

# దళారీ వ్యవస్థకు చెక్..

జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):

గొల్లపల్లి మండలం తిర్మలాపూర్ గ్రామంలో రైతుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన 'వడ్ల కొనుగోలు కేంద్రాన్ని' గురువారం అత్యంత కోలాహలంగా, అట్టహాసంగా ప్రారంభించారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర దక్కక దళారుల చేతిలో మోసపోతున్న రైతన్నలకు అభయమిస్తూ.. ప్రభుత్వ మద్దతు ధరను నేరుగా అందించే బృహత్తర సంకల్పంతో ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చారు.



కార్యక్రమానికి విచ్చేసిన చుట్టుపక్కల గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు ప్రత్యేకంగా ప్రశంసించారు. రైతుల కోసం సంఘం చేస్తున్న కృషి పలువురికి ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు.

### పారదర్శకతే మా నినాదం: ఛైర్మన్ గాదె హనుమాండ్లు

ఈ ప్రారంభోత్సవ వేడుకలో సంఘం ఛైర్మన్ గాదె హనుమాండ్లు మాట్లాడుతూ.. "రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు. మన కొనుగోలు కేంద్రంలో పారదర్శకమైన తూకాలు ఉంటాయి. ఒక్క గింజ కూడా నష్టపోకుండా ప్రతి రైతుకు గరిష్ట లాభం చేకూర్చేలా చూస్తాం. విక్రయించిన వెంటనే సకాలంలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం" అని ఆయన స్పష్టం చేశారు. రైతుల ముఖాల్లో ఆనందం చూడటమే తమ పాలకవర్గ ధ్యేయమని ఆయన ఉద్ఘాటించారు.గ్రామ, రైతాంగ అభివృద్ధిలో ఈ సహకార సంఘం పోషిస్తున్న కీలక పాత్రను ఈ

### కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు:

ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు ఒకే వేదికపైకి రావడం విశేషం. తిరుమలాపూర్ సర్పంచ్ కాషా అంజలి గంగాధర్, రంగదామునిపల్లి సర్పంచ్ జెల్ల అఖిల అనిల్ కుమార్, చిల్వకోడూరు సర్పంచ్ దాసరి తిరుపతి, సంఘం ఛైర్మన్ గాదె హనుమాండ్లు, వైస్ ఛైర్మన్ బాబు, మాజీ సర్పంచ్ ఎరవేణి రమేష్, క్యాషియర్ ఉస్మెమల లచ్చయ్య, కార్యదర్శి బైన రవి చంద్ వీరితో పాటు స్థానిక పాలకవర్గ సభ్యులు, వివిధ గ్రామాల నాయకులు మరియు పెద్ద సంఖ్యలో అన్నదాతలు ఈ వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# భానుడి భగభగ.. వడదెబ్బపై జాగ్రత్త!

మంచిర్యాల, ఏప్రిల్ 28 (క్రైమ్ మిర్రర్): జిల్లాలో ఎండలు మండిపోతుండటంతో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మహిళా సాధికరత, కిశోర బాలికల ఆరోగ్యంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు,మున్సిపల్ సిబ్బందికి వడదెబ్బ నివారణ చర్యలపై పోస్టర్లు,కరపత్రాల ద్వారా వివరించారు.వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు,వడగాలుల ప్రభావంతో డీహైడ్రేషన్, వడదెబ్బ వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, సరైన సమయంలో చికిత్స అందకపోతే ప్రాణాపాయం సంభవిస్తుందని ఆయన పేర్కొన్నారు.ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.మధ్యాహ్నం వేళల్లో అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని,వెళ్లాల్సి వస్తే గొడుగు,టోపీ వాడాలని తెలిపారు.రోజువారీ పనులను ఉదయం వేళల్లోనే పూర్తి చేసుకోవాలని సూచించారు.రోడ్ల పక్కన విక్రయించే రంగు పానీయాలు,కలుషిత ఆహారాన్ని తీసుకోకూడదని, మాంసాహారం తగ్గించి తాజా కూరగాయలు తీసుకోవాలని చెప్పారు. రోజుకు కనీసం 12--15 గ్లాసుల నీటితో పాటు మజ్జిగ,ఓఆర్ఎస్, గ్లూకోజ్ వంటి ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకుని, దోమలు ప్రబలకుండా పరిశుభ్రత పాటించాలని తెలిపారు.ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే చల్లని ప్రదేశానికి తరలించి,తడి గుడ్డతో శరీరాన్ని తుడవాలని సూచించారు.స్పృహలో ఉన్న వారికి ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఓఆర్ఎస్ ఇవ్వవచ్చని,స్పృహ కోల్పోయిన వారికి నోటి ద్వారా నీరు ఇవ్వకూడదని హెచ్చరించారు.అవసరమైతే వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించాలని కోరారు.స్కూళ్లకు సెలవులు ఉన్నందున పిల్లలు ఎండలో ఎక్కువసేపు ఆడకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం శుభ పరిణామం

**ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**



ఎల్బీనగర్ ఏప్రిల్ 28 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీరు మరియు శీతల పానీయాలు అందించేందుకు నాగోల్ డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ యువ నాయకులు పోచంపల్లి రాజేందర్ రెడ్డి ముందుకు వచ్చి స్థానికంగా సాయినగర్ కాలనీ,నాగోల్ రిలయన్స్ ఫ్రెష్,జైపూరి కాలనీ,ఆనంద్ నగర్ చౌరస్తాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి గా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పాల్గొని సాయి నగర్ వద్ద చలివేంద్రం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించేందుకు ఈ చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.చలివేంద్రం ద్వారా రోజువారీగా ప్రయాణించే ప్రజలు,కార్మికులు,ఆటో డ్రైవర్లు,పాదచారులకు చల్లని తాగునీరు, మజ్జిగ వంటి పానీయాలు ఉచితంగా అందించబడతాయి అని,ప్రజలు కూడా ఈ సేవను వినియోగించు కోవాలని,అలాగే ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.వేసవి కాలం ముగిసే వరకు ఈ చలివేంద్రం కొనసాగించబడుతుంది అని తెలిపారు.ఈ సందర్భంగా పోచంపల్లి రాజేందర్ రెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ బి ఆర్ ఎస్ నాయకులు ఆనంతుల రాజిరెడ్డి,డివిజన్ అధ్యక్షులు తూర్పటి చిరంజీవి,శ్యామ్ సుందర్,గుత్తా భాస్కర్ రెడ్డి మరియు పలువురు నాయకులు,యువకులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఈదురుగాలులకు క్రేన్ కూలి ఐదుగురు మృతి

**మరో 11 మందికి తీవ్ర గాయాలు**

**శంకర్ పల్లి పరిధిలోని 'ఎన్సీసీ' కంపెనీలో ఘటన**

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి**

శంకర్ పల్లి మండలం మహాలింగాపురం పరిధిలోని ఎన్సీసీ లిమిటెడ్ కంపెనీలో క్రేన్ కూలి ఐదుగురు కార్మికులు చనిపోయారు. మరో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, మేనేజ్ మెంట్ వివరాల ప్రకారం.. శంకర్ పల్లి మండలం మహాలింగాపురంలో ఎన్సీసీ కంపెనీలో భారీ క్రేన్స్, యంత్రాలు, కన్ స్ట్రక్షన్ మెషీన్ల రిపేర్, సర్వీసింగ్, స్పేర్ పార్ట్స్ స్టోరేజ్, స్టీల్ ఫ్యాబ్రికేషన్, మెటల్ వర్క్స్ చేస్తుంటారు. ఇందులో భాగంగానే కార్మికులు సోమవారం తమ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. సాయంత్రం సమయంలో భారీ ఈదురుగాలులు వీయడంతో వీరు పనిచేస్తున్న ప్రదేశంలో ఉన్న భారీ క్రేన్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ సమయంలో మొత్తం 16 మంది కార్మికులు ఉండగా.. ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. మరో ఇద్దరు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందారు. 11 మందికి గాయాలు కాగా మేనేజ్ మెంట్ వారికి వెంటనే అంబులెన్స్ సాయంతో శంకర్ పల్లిలో లలిత, గాయత్రీ ఆస్పత్రులకు తరలించారు. వీరికి ప్రస్తుతం చికిత్స అందిస్తున్నామని , పరిస్థితి బాగానే ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. కాగా, కార్మికులంతా జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వారిగా తెలిసింది. క్రేన్ వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, డీసీపీ

క్రేన్ కూలిన సంఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే యాదయ్య, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ డీసీపీ యోగేశ్ గౌతమ్, చేవెళ్ల కిషన్ , ఆర్డీవో పార్థసింహ రెడ్డి, సీఐ ముదుసరి అలీ, ఎమ్మార్వో సురేందర్ పరిశీలించారు. క్రేన్ కూలిన వద్ద సహాయక చర్యలను




పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరుపై కంపెనీ యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. గాయపడిన కార్మికులకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గాలి దుమారం కారణంతోనే ప్రమాదం జరిగిందని చెప్పారు. మృతుల కుటుంబాలు, క్షతగాత్రులకు సంస్థ నుంచి సాయం అందిస్తామని తెలిపారు. కాగా, పక్కనే ఉన్న రెండు షెడ్లకు ఎలాంటి ప్రమాదం జరగలేదు కానీ, 112 టన్నులు ఉన్న భారీ క్రేన్ గాలిదుమారంతో కూలిపోయిందని చెప్పడం అనుమానానికి తావిస్తోంది.

మృతి చెందిన కార్మికుల వివరాలు..( బీహార్ కి చెందిన వారు )

1. అలీ హుస్సేన్ 2. నాగేంద్ర సింగ్ 3. సాజీమ్ 4. ముకేష్ కుమార్ 5. సోను రజిబి

# శంకర్‌పల్లి యువ శౌర్య సేనకు గిన్నిస్ ఘనత






**గచ్చిబౌలిలో జరిగిన మహా కరాటే ఈవెంట్‌లో**

**18 వరల్డ్ రికార్డులు**

**ఈ విజయంతో శంకర్‌పల్లి ప్రాంతం**

**క్రీడారంగంలో మరో మైలురాయిని చేరుకుంది.**

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి**

శంకర్‌పల్లి ప్రాంతానికి చెందిన యువ శౌర్య సేన కరాటే విద్యార్థులు అంతర్జాతీయ వేదికపై మరోసారి తమ ప్రతిభను చాటుతూ 18 గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించి కీర్తి గడించారు.

ఆదివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన భారీ కరాటే కార్యక్రమంలో సుమారు 2000 మంది కరాటే యోధులు పాల్గొన్నారు. 6 సంవత్సరాల చిన్నారుల నుంచి 70 సంవత్సరాల వయోవృద్ధుల వరకు పాల్గొనడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ బృందానికి నాయకత్వం వహిస్తున్న రవీందర్ యాదవ్ (బ్లాక్ బెల్ట్ సిక్స్ డాన్) ఇప్పటికే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, గిన్నిస్ వరల్డ్ రికార్డ్, ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రహీతగా గుర్తింపు పొందారు. వైస్ ప్రెసిడెంట్ పి. గంగాధర్ (కరాటే బ్లాక్ బెల్ట్) కూడా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించి ప్రోత్సాహం అందిస్తున్నారు.ఈ సందర్భంగా శంకర్‌పల్లి యువ శౌర్య సేన విద్యార్థులు సమిష్టిగా అద్భుత ప్రదర్శన ఇస్తూ గిన్నిస్ రికార్డు సాధించడం గర్వకారణమైంది. కోచ్‌ల మార్గదర్శకత్వం లో క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేసిన ఫలితమే ఈ విజయమని నిర్వాహకులు తెలిపారు.రికార్డు సాధించిన విద్యార్థుల్లో రవీందర్ యాదవ్, పసుపులేటి గంగాధర్, గౌస్ పాషా, శ్రీ సాయి కిరీటి, లక్ష్మీ, భవ్య శ్రీ, భవిత శ్రీ, కావ్య, సిహెచ్ కావ్య, సిహెచ్ ప్రణతి, సాయి సహస్ర, సుశ్రీత్ రెడ్డి, హరి హరన్, విశాల్ చారి, సాయి హనీష్, ఎం సృజన్, సిహెచ్ జనార్ధన్, రియాన్స్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# మండుతున్న ఎండలు..!!

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎండలు రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలో గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవుతున్నాయి. ఉదయం నుంచే మండే ఎండలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మధ్యాహ్నం వేళ రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రత్యేకంగా రైతులు, కూలీలు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే వారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి కొరత కూడా కొన్ని గ్రామాల్లో సమస్యగా మారింది. పశువులకు నీరు అందక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఎండదెబ్బకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉండటంతో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలకు సూచనలు జారీ చేశారు. అవసరమైతే తప్ప బయటకు రావద్దని, తగినంత నీరు తాగాలని, తేలికపాటి ఆహారం తీసుకోవాలని సూచిస్తున్నారు. అలాగే తలపై టోపీ లేదా గుడ్డ కట్టుకుని బయటకు వెళ్లాలని, ఎండలో ఎక్కువసేపు ఉండకూడదని హెచ్చరిస్తున్నారు. ఇక వాతావరణ శాఖ అధికారులు మరో కొన్ని రోజుల పాటు ఈ తీవ్ర ఎండలు కొనసాగనున్నాయని తెలిపారు. ప్రజలు జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఎండలో పిల్లలు, వృద్ధులు జాగ్రత్త --**

**ఆరోగ్య నిపుణుల హెచ్చరిక**

తీవ్ర ఎండల నేపథ్యంలో పిల్లలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలు శరీరంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉండటంతో, ఈ వర్గాలు ఎక్కువగా ఎండదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లడం తప్పించుకోవాలని సూచిస్తున్నారు. బయటకు వెళ్లాల్సి వస్తే తలపై టోపీ లేదా గుడ్డ కట్టుకోవడం, గొడుగు ఉపయోగించడం మంచిదని అంటున్నారు. పిల్లలు బయట ఆడుకోవడం తగ్గించి, చల్లని ప్రదేశాల్లోనే ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. తగినంత నీరు, మజ్జిగ, పండ్ల రసాలు వంటి ద్రవాలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా శరీరంలో నీటి కొరత రాకుండా చూడాలి. వృద్ధులు తేలికపాటి ఆహారం తీసుకుంటూ, తరచూ విశ్రాంతి తీసుకోవడం అవసరం. ఎండలో ఎక్కువసేపు ఉండడం వల్ల తలనొప్పి, తల తిరగడం, అలసట వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, అవసరమైన జాగ్రత్తలు పాటించడం ద్వారా ఎండ ప్రభావం నుంచి తమను తాము రక్షించుకోవాలని ఆరోగ్య శాఖ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# జనగణన శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్

**చౌటుప్పల్, ఏప్రిల్ 28, క్రైమ్ మిర్రర్:**

సెన్సెస్ 2027 జనగణన ప్రక్రియలో భాగంగా నిర్వహించ తలపెట్టిన రెండవ రోజు ఫేస్–3 ట్రైనింగ్ ప్రోగ్రామ్ సోమవారం ఘనంగా కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి స్వయంగా పర్యవేక్షించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు సెన్సెస్ నిర్వహణలోని మెళకువలు, సాంకేతిక అంశాలపై మాస్టర్ ట్రైనర్లు దశరథ, ప్రసాద్ లు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..ప్రతి ఎన్యూమరేటర్, సూపర్వైజర్ బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజల నుండి ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని సూచించారు. డేటా నమోదులో ఎటువంటి తప్పులు జరగకుండా జాగ్రత్త వహించాలని ఆయన ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రఘుపతి, సెన్సెస్ టెక్నికల్ అసిస్టెంట్ ప్రవళిక తదితర సిబ్బంది పాల్గొన్నారు.






## హక్కుల సాధనకై కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి

**-సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి** కార్మికులు తమ హక్కుల సాధన కోసం పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. శ్రీనివాస్ అధ్యక్షతన మేడే సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. కల్వకుర్తి పట్టణంలోని సిఐటియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని మేడే ఉత్సవాల్లో ప్రతి కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా 140 సంవత్సరాల క్రితం ఎనిమిది గంటల పని దినాల కోసం జరిగిన మహోత్తర పోరాటం వల్ల కార్మికులు అనేక హక్కులు చట్టాలు సాధించుకున్నప్పటికీ నేటి పాలకులు కార్మిక చట్టాలకు హక్కులకు భంగం కలిగించే చర్యలు చేపడుతున్నారని వాటిని రక్షించుకోవడం కోసం ప్రతి కార్మికుడు ముందుకు రావాల్సిన అవసరం ఉందని యూనియన్లు ఉన్నా లేకున్నా కార్మికుల హక్కుల కోసం జరిగే పోరాటంలో యూనియన్లతో నిమిత్తం లేకుండా ప్రతి కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో హమాలీ సంఘం, భవన నిర్మాణ కార్మిక సంఘం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వివిధ సంఘాల నాయకులు ఎన్ బాలయ్య శ్రీశైలం రాజు గౌడ్ యాదయ్య చంద్రయ్య పర్వతాలు రమేష్ రజనంగం జిల్లా ఉపాధ్యక్షులు చిలుక బాల్రెడ్డి సిపిఎం నాయకులు ఏపీ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తిలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

**-విద్యుత్ సిఎండి జితేష్ వి పాటిల్ కు మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల వినతి**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి** కల్వకుర్తి పుర పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కల్వకుర్తి మున్సిపల్ చైర్పర్సన్ బృంగి రత్నమాల మంగళవారం విద్యుత్ శాఖ సీఎండి జితేష్ వి పాటిల్ కు వినతి పత్రం అందజేశారు. కల్వకుర్తి పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ను సిఎండి తనిఖీ చేశారు. ఈ మేరకు మున్సిపల్ చైర్ పర్సన్ రత్నమాల ఆనంద్ కుమార్ విద్యుత్ శాఖకు సంబంధించి పలు సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. అందులో ప్రధానంగా తిమ్మరాశిపల్లి, సిలార్ పల్లి సబ్ స్టేషన్ల నిర్మాణములు తొందరగా పూర్తిచేయాలి. విద్యానగర్ కాలనీలో 33 కె.వి. ఫీడర్, సిర్సనగండ్లకు సంబంధించిన కేబుల్ 2.5 కిలోమీటర్ల ఉన్నది. దీనిని వెంటనే తొలగించాలి. ఈ విషయంపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి లేఖ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో డ్రైనేజీ వ్యవస్థ లేక కాలనీ పూర్తిగా బురదమయమైనది. ఎలక్ట్రిసిటీ కార్యాలయం ప్రాంగణం నుండి డ్రైనేజీ నిర్మాణమునకు అనుమతి ఇవ్వగలరని కోరారు. కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో చాలా కొత్త కాలనీలు ఏర్పడ్డాయని వాటికి అనుగుణంగా 200 కరెంట్ స్తంభాలు అవసరమైన మెటీరియల్ వెంటనే మంజూరు చేయగలరని పేర్కొన్నారు. కల్వకుర్తి మున్సిపాలిటీకి వంద 25 కె.వి. ట్రాన్స్ ఫార్మర్లు మంజూరు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు వైస్ చైర్మన్ శానావాజ్ ఖాన్, కౌన్సిలర్ కొల్లూరి రాజేష్ కుమార్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి బ్యాటరీల దొంగతనం గుట్టురట్టు

**ముగ్గురు నిందితుల అరెస్ట్.. 25 బ్యాటరీల స్వాధీనం**

**నార్లాపూర్ హైవే వద్ద పట్టుకున్న పోలీసులు**



**మందమర్రి, ఏప్రిల్ 28 (క్రైమ్ మిర్రర్)** మందమర్రిలోని సింగరేణి ఏరియా స్టోర్‌లో జరిగిన బ్యాటరీల దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు.ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి,వారి వద్ద నుంచి 25 బ్యాటరీలతో పాటు దొంగతనానికి వాడిన ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు మందమర్రి సీఐ వెల్లడించారు.పోలీసుల కథనం ప్రకారం ఈ నెల 20వ తేదీ అర్ధరాత్రి సమయంలో సింగరేణి ఏరియా స్టోర్స్‌లోకి చొరబడిన దుండగులు భారీగా బ్యాటరీలను అపహరించారు.దీనిపై 25వ తేదీన ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో మందమర్రి ఎస్ఐ జి. నరేష్ తన సిబ్బందితో కలిసి నార్లాపూర్ గ్రామ సమీపంలోని హైవేపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక ఆటో అనుమానాస్పదంగా కనిపించింది. పోలీసులను చూడగానే ఆటోను వెనక్కి తిప్పి పారిపోయే ప్రయత్నం చేయగా,అప్రమత్తమైన పోలీసులు వెంబడించి అడ్డుకున్నారు.ఆటోను తనిఖీ చేయగా అందులో 25 బ్యాటరీలు లభ్యమయ్యాయి.ఆటోలో ఉన్న ధనకుంట్ల మునియప్ప (రామన్ కాలనీ), జన్నే నరేంద్ర (యాపల్), గాజుల శివప్రసాద్ (ఇంద్రానగర్)లను విచారించగా తామే సింగరేణి స్టోర్స్‌లో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. అతి తక్కువ సమయంలో కేసును ఛేదించిన ఎస్ఐ నరేష్, సిబ్బంది రాకేష్, మహేష్,కృష్ణ, శ్రీనివాస్‌లను సీఐ అభినందించారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను పోరాటాలను ఆపలేరు

**-విద్యార్థి నాయకుల అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్య హక్కుల పై దాడి**

**- విద్యార్థులకు రావాల్సిన ఫీజు రియంబర్స్మెంట్స్ విడుదల చేయమంటే అరెస్టు చేయడం సరికాదు**

**-ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి,మహేష్**




**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న వృత్తి,స్కాలర్షిప్,ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నేడు జరుగు హలో విద్యార్థి చలో సీఎం ఇంటికి కార్యక్రమానికి తరలి వెళ్లనున్న విద్యార్థులను పోలీసులు తెల్లవారి నుండి అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన ఫీజు బకాయిలు విడుదల చేయమంటే అక్రమ అరెస్టు చేసి విద్యార్థి ఉద్యమాన్ని అణిచివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని వారు అన్నారు. తక్షణమే పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకపోతే విద్యార్థులను,యువత ఏకం చేసి రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమవుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.రాష్ట్ర వ్యాపితంగా పెండింగ్లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ విడుదల చేయకుండా ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర ఈ రాష్ట్ర ప్రభుత్వం చేసిందని వారు మండిపడ్డారు.తక్షణమే పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వారితో పాటు ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు మా నరసింహ చారి, కార్యదర్శి సుద్దాల సాయి కుమార్ లను కూడా అరెస్టు చేశారు.

# బాలికల భవిష్యత్తుతో ఆటలాడితే కఠిన చర్యలు

**- బాలికలను లక్ష్యంగా చేసుకున్న ముఠాలపై ప్రత్యేక నిఘా**

**- కిషోర బాలికలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు**

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి**

మహాదేవపూర్ మండలంలో బాలల భద్రత, రక్షణ మరియు మాదక ద్రవ్యాల వ్యతిరేక సంక్షేమ వారోత్సవాల సందర్భంగా కిశోర బాలికలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం సీడీపీఓ రాధిక రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా మహాదేవపూర్ సర్పంచ్ హసీనా భాను హాజరై బాలికలకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ హసీనా భాను మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో మాదక ద్రవ్యాల ముఠాలు యువతను, ముఖ్యంగా కిశోర బాలికలను లక్ష్యంగా చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ వల్ల ఆరోగ్యం మాత్రమే కాదు, భవిష్యత్తు కూడా నాశనం అవుతుందని పేర్కొన్నారు. అలాంటి ప్రమాదాల నుంచి దూరంగా ఉండేందుకు ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీడీపీఓ రాధిక రెడ్డి మాట్లాడుతూ, బాలికల భద్రత సమాజం మొత్తం బాధ్యత అని పేర్కొన్నారు. స్కూళ్లు, కాలేజీల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థినులకు వివరంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు బాలికలకు స్వీయ రక్షణ, చట్టపరమైన హక్కులు, మరియు మాదక ద్రవ్యాల వ్యతిరేక చర్యలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలపై నిఘా ఉంచి, వారి ప్రవర్తనలో మార్పులు గమనిస్తే వెంటనే స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పేదల బియ్యం పక్కదారి..20 క్వింటాల పిడిఎస్ బియ్యం పట్టివేత



**చింతపల్లి(క్రైమ్ మిర్రర్)** ప్రభుత్వం పేద ప్రజల ఆకలి తీర్చడం కోసం సరఫరా చేస్తున్న, ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం పక్కదారి పడుతున్న ఉదంతాలు, మరోసారి కలకలం రేపుతున్నాయి. చింతపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం జరిగిన తనిఖీల్లో, అక్రమ బియ్యం పట్టుబడటం ఈ దందా మూలాలను ప్రశ్నిస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు చింతపల్లి ఎస్సై, తన సిబ్బందితో కలిసి విరాట్ నగర్ కాలనీ సమీపంలో వ్యూహాత్మకంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న అశోక్ లీలాండ్ బొలెరో ట్రాలీని ఆపి సోదా చేయగా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న, 40 బస్తాల సుమారు 20 క్వింటాల రేషన్ బియ్యం బయటపడ్డాయి. మాడుగుల మండలం అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాగిళ్ల శ్రీకాంత్ అనే వ్యక్తి, అన్నబోయినపల్లి చుట్టుపక్కల గ్రామాల నుండి, తక్కువ ధరకు ఈ బియ్యాన్ని సేకరించి, అధిక లాభాలకు విక్రయించే ఉద్దేశంతో, తరలిస్తున్నట్లు తెలుస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లోని అమాయక ప్రజల నుండి సేకరిస్తున్న ఈ బియ్యం, రీ-సైక్లింగ్ ద్వారా తిరిగి బహిరంగ మార్కెట్లోకి చేరుతున్నాయనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, బియ్యంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, చింతపల్లి ఎస్ఐ రాంమూర్తి హెచ్చరించారు. ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న ఇతర సూత్రధారులను కనుగొనే దిశగా దర్యాప్తు జరుగుతుందని తెలుస్తుంది.

## నాగలింగేశ్వర స్వామి ఆలయ 8వ వార్షికోత్సవ వేడుకలలో పాల్గొన్న ప్రముఖులు..



**మియాపూర్ క్రైమ్ మిర్రర్ :** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీ లో గల శ్రీ శ్రీ శ్రీ నాగలింగేశ్వర స్వామి దేవస్థానము 8వ (అష్టమ) వార్షికోత్సవం కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్ , నార్నె శ్రీనివాసరావు , ఉప్పలపాటి శ్రీకాంత్ లతో కలిసి ముఖ్యఅతిథిగా ప్రత్యేక పూజల కార్యక్రమంలో పాల్గొన్న పి ఎ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ ,కార్పొరేటర్లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ,భక్తులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## సేవాదళ్ సమర్థ శిక్షణ శిబిరంలో పాల్గొన్న వి.జగదీశ్వర్ గౌడ్ ,యలమంచి ఉదయ్ కిరణ్..



**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :**
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సేవాదళ్ ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు నిర్వహిస్తున్న "సమర్థ-శిక్షణ శిబిరం"లో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు ,మియాపూర్ యువనాయకులు యలమంచి ఉదయ్ కిరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వి. జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, సేవాదళ్ అనేది కేవలం ఒక సంస్థ కాదని, క్రమశిక్షణ, సేవా భావం, త్యాగం అనే విలువలపై నిలిచిన శక్తివంతమైన వేదిక అని పేర్కొన్నారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజల హక్కుల కోసం పోరాడుతూ, స్వాతంత్ర్య సమరం నుండి సామాజిక న్యాయం వరకు కీలక పాత్ర పోషించిందని తెలిపారు. కాంగ్రెస్ అంటే సేవ... సేవ అంటే ప్రజల గెలుపు. ప్రజల పక్షాన పోరాటమే సేవాదళ్ ధర్మం అని ఆయన పేర్కొన్నారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, దేశ నిర్మాణంలో వారి భాగస్వామ్యాన్ని బలపరచడం, ప్రతి కార్యకర్తను సేవా దిశగా తీర్చిదిద్దడం ఈ శిక్షణ శిబిరం ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ శిబిరం ద్వారా సేవాదళ్ కార్యకర్తలు నాయకత్వ నైపుణ్యాలు, ప్రజా సమస్యలపై అవగాహన, క్రమశిక్షణ, ఐక్యత వంటి విలువలను అలవరుచుకుంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తు నాయకులను తీర్చిదిద్దే వేదికగా ఈ శిక్షణ శిబిరం నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులు విజయభాస్కర్ రెడ్డి , సౌందర్య రాజన్ , ప్రణీత్,రత్నాచారి,సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లక్ష్య సాధన కోసం కష్టపడి చదవండి: సుంకిరెడ్డి రాఘవేందర్

### కల్వకుర్తిలో ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభం





**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి** ప్రభుత్వ ఉద్యోగాల సాధన కోసం గ్రామీణ ప్రాంతాల యువత వేలకు వేలు ఫీజులు కట్టి కోచింగ్లు తీసుకోలేక ప్రభుత్వ ఉద్యోగాలకు దూరమవుతున్నారని అలాంటివారిని దృష్టిలో ఉంచుకొని ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మంగళవారం కల్వకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలీస్ ఉద్యోగాల కోసం ఉచిత కోచింగ్ సెంటర్ ను ప్రారంభించారు. ఫీజులు భారమై కోచింగ్ తీసుకోలేక ఇంటి వద్దనే ఉంటున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి నిరుద్యోగులను రేపటి ఉద్యోగులుగా చూడడమే తన లక్ష్యమని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది ప్రతిభావంతులైన యువకులు అవకాశాలు రాక ఖాళీగా ఉంటున్నారని ఇప్పుడు ఐక్యత ఫౌండేషన్ ద్వారా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టుదల ఉన్న యువతకు ఆర్థికపరిస్థితులు అడ్డంకి కాకూడదనే నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రంలో ఉచిత కోచింగ్ సెంటర్ ను ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఉచిత శిక్షణతో పాటు మెటీరియల్ కూడా ఉచితంగానే అందజేస్తామని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రెడ్డి చెప్పారు. తన ఫౌండేషన్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలపై పలువురు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డిని కొనియాడారు. విద్య వైద్యం ఉపాధి లక్ష్యంతో స్థాపించిన ఐక్యత ఫౌండేషన్ నేడు కల్వకుర్తి నియోజకవర్గం లో ఆశించిన ఫలితాలు సాధిస్తుందని అభిప్రాయపడ్డారు ఫౌండేషన్ ద్వారా ఎంతో మంది లబ్ది పొందారని గుర్తు చేశారు. వచ్చిన అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని నిత్యం క్రమశిక్షణతో క్లాసులకు హాజరై మంచి శిక్షణ పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలుప్రసూన, జేఏసీ చైర్మన్ సదానందం గౌడ్, శ్రుతిలయ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్ దాస్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ బందేయ్య రజకపై హత్యాయత్నం చేసిన రాంరెడ్డిని అరెస్ట్ చేయాలి

**??లీమ్స్ హాస్పిటల్లో బందేయ్యను పరామర్శించిన నేషనల్ ధోబి రిజర్వేషన్ సంఘ్, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి నాయకులు**

**?? ఏసిపి ,ఎస్సై లతో ఫోన్లో మాట్లాడిన గోపి రజక**

**?? మీడియాతో మాట్లాడిన నడిమింటి శ్రీనివాస్, గోపి రజక**

**శంషాబాద్, ఏప్రిల్ 28(క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లీమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న చౌదరి గూడెం మండలం ఎలుక గూడెం గ్రామ సర్పంచ్ బందేయ్యను మంగళవారం హాస్పిటల్లో కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నేషనల్ ధోబి రిజర్వేషన్ సంఘ్ జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల నర్సింగరావు , రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శ్రీశైలం. అనంతరం నడిమింటి శ్రీనివాస్ స్పందిస్తూ ప్రక్క ఊరికి చెందిన నలుగురు బందేయ్యపై దాడి చేసి ఐదు రోజులు గడుస్తున్నా ఇద్దరినీ మాత్రమే అరెస్టు చేసి మిగత ఇద్దరినీ ప్రధానంగా మాజీ సర్పంచ్ రాంరెడ్డిని అరెస్ట్ చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాసంక్షేమ ప్రభుత్వంలో సర్పంచ్ లకే భద్రత లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏలా ఉంటుందో చెప్పనక్కర్లేదు అని ఆవేదన వ్యక్తంచేశారు. రాంరెడ్డిని తక్షణమే అరెస్ట్ చేసి అత్యాయత్నం కేసు పెట్టాలని నేషనల్ ధోబి రిజర్వేషన్ సంఘ్, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి డిమాండ్ చేస్తుంది. కేసును తప్పుదోవ పట్టిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం. పోలీస్ శాఖ నిష్పక్షపాతంగా వ్యవహరించి కేసును త్వరితగతిన పూర్తి చేయాలని ఏసిపి , ఎస్సై లను కోరారు. సర్పంచ్ బందేయ్య పై జరిగిన దాడి విషయం తెలుసుకొని వెంటనే స్పందించి వారిని హాస్పిటల్లో చేర్పించినందుకు షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కి ధన్యవాదాలు. అదేవిధంగా దోషులకు కఠినంగా శిక్ష పడేవరకు ఎమ్మెల్యే బాధ్యత వహించాలని కోరారు.

# అభిశ్రీ సత్యం గుంటికి వరల్డ్ వండర్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారం

**ఎల్బీనగర్ ఏప్రిల్ 28,క్రైమ్ మిర్రర్ ప్రతినిధి** యువ పారిశ్రామికవేత్తగా సాధించిన ఘనతకు గాను, వరల్డ్ వండర్స్ రికార్డ్స్ అభిశ్రీ సత్యం గుంటికి ఈ సర్టిఫికెట్‌ను జారీ చేశారు. భవనంలో 48 అడుగుల ఎత్తుతో అత్యంత ఎత్తైన నెంబర్ 1 సంఖ్య సంకేత ఫలకాన్ని ఏర్పాటు చేసినందుకు గాను, వారు ఈ సర్టిఫికెట్‌తో ఆయనను గౌరవించారు. నేటి తరం పిల్లలకు స్ఫూర్తినిచ్చేలా భవనాలను నిర్మించడంలో ఆయనకున్న ప్రతిభ కారణంగా, ఆయనను పారిశ్రామికవేత్త అని ఎందుకు పిలుస్తారో అర్థం చేసుకోవచ్చు. నిజానికి, ఈ అభి శ్రీ సత్యం గుంటి స్వచ్ఛంద సంస్థలు (ఛీ+ాలు) మరియు అలాంటి అనేక విషయాలపై ఆసక్తి ఉన్న ఒక యువ పారిశ్రామికవేత్త. అందుకే, ఆయనను గౌరవించేందుకు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. మూడు వేర్వేరు ప్రదేశాలలో భవనాన్ని ఏర్పాటు చేసిన ఈ అద్భుతమైన ఘనత, ప్రపంచంలోనే మొట్టమొదటిసారి సాధించిన విజయంగా గుర్తింపు పొందింది. వ్యక్తిగత విజయం విభాగంలో ఒక కొత్త ప్రపంచ ప్రమాణాన్ని నెలకొల్పినందుకు గాను, వారు ఈ సర్టిఫికెట్‌ను అందించారు, ఈ కార్యక్రమానికి అభి శ్రీ సత్యం గుంటి కజిన్ సోదరి సింధు సంబంగి కూడా హాజరయ్యారు. 48 అడుగుల ఎత్తైన భవనంపై ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన నెంబర్ 1 సంఖ్య సంకేత ఫలకాన్ని సృష్టించి అభి శ్రీ సత్యం గుంటి విజయవంతంగా ప్రపంచ రికార్డును సాధించారు. ఈ ఫలకాన్ని భవనం యొక్క మూడు వైపులా ఏర్పాటు చేశారు. ఈ నిర్మాణం యొక్క మూడు ప్రదేశాలలో ఇది ప్రదర్శించబడుతుంది. హైదరాబాద్‌లో మరియు



ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా సాధించిన ఘనతగా ఈ మైలురాయిని ప్రశంసించారు. ఇది ఆర్కిటెక్చర్ సైనేజ్ ఎక్సలెన్స్‌లో ఒక కొత్త గ్లోబల్ బెంచ్ మార్క్‌ను నెలకొల్పింది. 48 అడుగుల ఎత్తైన భవనంపై ఉన్న అతిపెద్ద సంఖ్య సంకేత ఫలకాన్ని ప్రపంచ వింతల రికార్డుగా నమోదు చేయడమే దీని ఉద్దేశ్యం. నెం.1 శ్రీధర్ ప్రపంచవ్యాప్తంగా సుప్రసిద్ధ టెలికాం వ్యాపారవేత్త. ఆయన దక్షిణ భారతదేశంలోని ఒక ఐకానిక్ టవర్‌ను అభి శ్రీ సత్యం గుంటి కి బహుమతిగా ఇచ్చారు. హైదరాబాద్‌లో దీనిని 2026 మే 11న ప్రారంభించనున్నారు. నెం.1 శ్రీధర్ భార్య అయిన శ్రీ హ్యాండ్లూమ్స్ వ్యవస్థాపకురాలు ఎం. రాజేశ్వరి, శ్రీ హ్యాండ్లూమ్స్‌ను ప్రారంభించబోతున్నారు. ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుండి పలువురు ప్రముఖులు , ఎమ్మెల్యే , ఎంపీలు , మినిస్టర్స్ హాజరు కానున్నారు.

## ఆర్పీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటా : ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి




**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్)** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్పేట్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఆర్పీల సమస్యలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్పీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తమ సమస్యలపై ఆర్పీలు మాట్లాడుతూ గత ఐదు నెలలుగా తమకు జీతాలు అందడం లేదని, సర్వే నిర్వహించినందుకు రావాల్సిన పారితోషికం కూడా ఇప్పటివరకు చెల్లించలేదని వాపోయారు. ఐదు లక్షల రూపాయలు మంజూరైనప్పటికీ ఒక్క రూపాయి కూడా అందలేదని తెలిపారు. అదేవిధంగా మైక్రో క్రెడిట్ ప్లాన్ యాప్‌ను తరచూ మార్చడం వల్ల లోన్లు సకాలంలో అందించడం కష్టమవుతోందని చెప్పారు. అభయ హస్తం ద్వారా రావాల్సిన నిధులు కూడా ఆలస్యంగా అందుతున్నాయని, దీనివల్ల ప్రజలు తమపై ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పావలా వడ్డీ రుణాలు పేరుకు మాత్రమే ఉన్నాయని, గడిచిన ఐదు నెలలుగా ఎలాంటి రుణాలు ప్రజలకు అందడం లేదని తెలిపారు. ప్రభుత్వం ద్వారా అందాల్సిన వడ్డీలేని రుణాలు కూడా అందడం లేదని ఆర్పీలు పేర్కొన్నారు. దీంతో ప్రజలు తమనే ప్రశ్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే శ్రీనిధికి సంబంధించిన సమస్యలను కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ఆర్పీలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమస్యలపై పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు. అభయ హస్తం నిధుల విడుదలలో జరుగుతున్న ఆలస్యంపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కారం చూపిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బడంగ్పేట్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, డిపిఓ అశ్విని, యూనియన్ నాయకురాలు మంజుల, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు జగన్మోహన్ రెడ్డి హత్యను ఖండించిన టీడబ్ల్యూజేఎఫ్

**హైదరాబాద్(క్రైమ్ మిర్రర్)** ఏపీలోని చిత్తూరు జిల్లా వి.కోట మండలంలో ఆంధ్రజ్యోతి సీనియర్ రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డి ని హత్య చేయడం అమానుష చర్య అని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య తీవ్రంగా ఖండించారు. అత్యంత పాశవికంగా జగన్మోహన్ రెడ్డిని హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు జగన్మోహన్ రెడ్డి హత్యను తీవ్రంగా ఖండిస్తూ, అతని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సమాజంలో జర్నలిస్టులకు రక్షణ కరువైందని, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని మామిడి సోమయ్య అన్నారు.

# మందమర్రిలో చర్చి నిర్మాణానికి భూమి పూజ చేసిన మంత్రి వివేక్ వెంకట స్వామి





**త్వరలోనే మందమర్రి పేదలకు ఇందిరమ్మ ఇల్లు**

**ఏజెన్సీ చట్టం సమస్యపై రెవిన్యూ మంత్రితో చర్చించా: వివేక్**

**మందమర్రి ఏప్రిల్ 28 (క్రైమ్ మిర్రర్)** యేసుక్రీస్తు బోధనలు సమాజానికి మార్గదర్శకమని,ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, సేవాభావం కలిగి ఉండాలని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద 'బేతేస్థ మినిస్ట్రీస్' చర్చి నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా బేతేస్థ జెండాను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం పాస్టర్ జైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు మంత్రిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ పేదవారి పట్ల స్నేహ భావంతో ఉండాలని క్రీస్తు చెప్పిన మాటలను గుర్తుచేశారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను ఎన్నడూ మర్చిపోవద్దని, వారిని ప్రేమగా చూసుకోవాలని సూచించారు. మిషనరీ స్కూళ్లలో చదివిన విద్యార్థులు మంచి క్రమశిక్షణతో పాటు సేవా దృక్పథాన్ని కలిగి ఉంటారని కొనియాడారు. మందమర్రి పట్టణంలో ఉన్న 1/70 ఏజెన్సీ యాక్ట్ సమస్య వల్ల ఇళ్ల నిర్మాణానికి ఆటంకాలు కలుగుతున్నాయని, ఈ విషయాన్ని ఇప్పటికే రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని వివేక్ తెలిపారు. త్వరలోనే పట్టణ ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల పనులు జరుగుతున్నాయని, రెండు శ్మశాన వాటికలు, క్రిమిటోరియం, ఖబరస్తాన్ పనులు కూడా సాగుతున్నాయని వివరించారు. అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా పాలన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# మల్కాజ్గిరి ఎంపీ ఈటెలను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన కొత్తపేట మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్

**ఎల్బీనగర్ ఏప్రిల్ 28 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి** శామీర్పేట్లోని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ని వారి నివాసంలో కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి, కొత్తపేట డివిజన్‌కు సంబంధించిన పలు ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా డివిజన్‌లోని రహదారుల దుస్థితి, కాలువల శుభ్రత, పారిశుద్ధ్య సమస్యలు, తాగునీటి సౌకర్యాలు, కాలనీ అభివృద్ధి పనులు, వీధి దీపాల ఏర్పాటు, డ్రైనేజ్ సమస్యలు, కొత్తపేట డివిజన్లో దోబిగాట్ ఏర్పాటు వంటి అంశాలను ప్రస్తావించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరంగా తెలియజేస్తూ, వాటికి తక్షణ పరిష్కారం అవసరమని కోరారు,



దీనికి సానుకూలంగా స్పందించిన ఎంపీ ఈటల రాజేందర్. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు వగ్గుల సుందర్ నారాయణ, వెంకట్ రెడ్డి, తిరుమల పాల్గొన్నారు.

# గ్రామానికి సేవ చేయడం అభినందనీయం..





**- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.**

**కేశంపేట,(క్రైమ్ మిర్రర్):** జన్మనిచ్చిన కన్న తల్లిదండ్రుల రుణం తీర్చుకోవడం కోసం గ్రామాభివృద్ధి కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేస్తున్న పల్లె బ్రదర్స్ సేవలు ఎంతో అభినందనీయమని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం కేశంపేట మండలంలోని పాపిరెడ్డి గూడా గ్రామపంచాయతీ పరిధిలోని ఆవాజ్మీయ పడకల్ నుంచి గ్రామానికి 84 లక్షల బీటీ రోడ్డును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పనులకు శంకుస్థాపన చేశారు. కొత్తపేట గ్రామంలో పిఏసిఎస్ బ్యాంక్ ఆవరణలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కొండారెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్ అతని సోదరుడు పల్లె బాలేశ్వర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న 92 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుండి కొండారెడ్డిపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతూ తమ తల్లిదండ్రుల కీర్తిశేషులు పల్లె పద్మమ్మ వెంకటయ్య జ్ఞాపకార్థం వారి పేరు మీద అనేక సేవా కార్యక్రమాలు చేయడం చాలా గర్వించదగ్గ విషయం అన్నారు.రాష్ట్రస్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దిన ఘనత వారికే దక్కుతుందన్నారు.గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు.గ్రామ సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఎందరో ఉన్నత పదవులలో కొనసాగుతున్నారని, విద్యార్థులు ప్రజలతో పాటు శరీర దారిద్యం పెంపొందించు కోవాలని సంకల్పంతోనే సైకిల్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రాబోవు రోజులలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల లో పల్లె బాలేశ్వర్, మండల పార్టీ అధ్యక్షుడు గూడ వీరేశం, మాజీ జెడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి, నాయకులు శ్రీధర్ రెడ్డి, సర్పంచులు పట్వారి హైమావతి జగదీశ్వర్, శశిరేఖ,భాస్కర్ గౌడ్,నాగేశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, గ్రామ దేవాలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ సర్పంచి రాజు,గ్రామ మాజీ సర్పంచ్ రాజు ఉపసర్పంచ్ లు శ్రీను,శివ మల్లేష్ గౌడ్,లింగం, నాయకులు అనసూయమ్మ,రాణి, గిరి యాదవ్,పర్వతాలు,రాములు,రామ్ రెడ్డి,రాజేందర్ రెడ్డి,నాయకులు పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ మండల కన్వీనర్‌గా సిద్దాపూర్ నవీన్ కుమార్



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్)** తెలంగాణ రాష్ట్ర సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి, రాష్ట్ర మైనారిటీ విభాగం అధ్యక్షుడు జనాబ్ మహమ్మద్ ముస్తఫా, జిల్లా బిసి విభాగం అధ్యక్షులు శివశంకర్ల ప్రతిపాదన ను పరిగణనలోకి తీసుకుని, షాబాద్ మండల కన్వీనర్‌గా సిద్దాపూర్ నవీన్ కుమార్ ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి, మహమ్మద్ ముస్తఫా సంయుక్తంగా మాట్లాడుతూ ?అస్తిత్వానికి ఆనవాలు పోరాటానికి ప్రతిరూపం తెలంగాణ రాష్ట్ర సేన (టిఆర్ఎస్) అని కవిత నాయకత్వంలో టిఆర్ఎస్ ను ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి చేరువ చేయడమే మా లక్ష్యమని అన్నారు. షాబాద్ మండలంలో టిఆర్ఎస్ బలోపేతానికి సిద్దాపూరం నరేష్ చురుగ్గా పనిచేస్తారని, యువతను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతారని ఆశిస్తున్నామని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, నూతన పార్టీని ఏర్పాటు చేసిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సేన ఆశయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నూతన కన్వీనర్ పై ఉందని పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన సిద్దాపురం నవీన్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కవిత, జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి, మహమ్మద్ ముస్తఫా, శివశంకర్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. షాబాద్ మండలంలో నూతనంగా ఏర్పాటు కాబడ్డ తెలంగాణ రాష్ట్ర సేన జెండాను రెపరెప లాడిస్తానని, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటానని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సేన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# అర్హులకు రెండు పడక గదుల ఇండ్లు

**పనులు వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు**



**మంచిర్యాల,ఏప్రిల్ 28 (క్రైమ్ మిర్రర్)** అర్హులైన లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇండ్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్‌లో నిర్మాణంలో ఉన్న రెండు పడక గదుల ఇండ్లను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,నిరుపేదలకు గూడు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఈ పథకంలో అర్హులైన వారిని గుర్తించి ఇండ్లను అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.నిర్మాణంలో ఉన్న పనులను వేగవంతం చేసి, నిర్దేశిత కాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నూతన కమిషనర్ కలిసిన టీయుడబ్ల్యూజే నేతలు..



**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన జి. ముకుందరెడ్డిని, ఇవ్వాళ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీ యు డబుల్యూ జే )రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో రాష్ట్ర బాధ్యులు సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని విరాహత్ కోరారు. కమిషనర్ ను కలిసిన వారిలో టీయుడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కల్లూరి రాములు, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డిలు ఉన్నారు.

# వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

## అశ్రద్ధ చేస్తే ప్రాణాపాయం:మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్

## అంగన్‌వాడీలు, మున్సిపల్ సిబ్బందికి అవగాహన

**మంచిర్యాల, ఏప్రిల్ 28 (క్రైమ్ మిర్రర్)**



జిల్లాలో ఎండ తీవ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకో వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిం చిన అవగాహన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు, పిల్లలు,మున్సిపల్ సిబ్బందికి వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు, వేడి గాలుల కారణంగా వడదెబ్బ,డీహైడ్రేషన్ వంటి సమస్యలు సాధారణంగా తలెత్తుతాయని, సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాపాయం కలగవచ్చని హెచ్చరించారు. ప్రజలు ఉదయం పూటనే తమ పనులను పూర్తి చేసుకోవాలని, మధ్యాహ్నం తీవ్ర ఎండలో బయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.రోడ్లపై లభించే చల్లని రంగు పానీయాలు, కలుషిత ఆహారం తీసుకోవద్దని, మాంసాహారం తగ్గించి తాజా కూరగాయలను ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. రోజుకు కనీసం 12,15 గ్లాసుల నీటితో పాటు మజ్జిగ, ఓఆర్ఎస్, గ్లూకోజ్ వంటి ద్రవపదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత పాటించి దోమల పెరుగుదలను నివారించాలని తెలిపారు.అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వస్తే టోపీ లేదా గొడుగు వినియోగించాలని, ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే చల్లని ప్రదేశానికి తరలించి, తడి గుడ్డతో శరీరాన్ని తుడవాలని సూచించారు.స్పృహలో ఉన్నవారికి ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఓఆర్ఎస్ ఇవ్వవచ్చని, అపస్మారక స్థితిలో ఉన్నవారికి నీరు త్రాగించకూడదని స్పష్టం చేశారు.అవసరమైతే వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించాలని తెలిపారు.గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు, మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్కూళ్లకు సెలవులు ఉన్నందున పిల్లలు ఎండలో ఆడకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని కోరారు."మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బను నివారించవచ్చు" అని వెంకటేశ్వర్ పేర్కొన్నారు.పోస్టర్లు, కరపత్రాల ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## వెల్జాల్ దగ్గర రెండు కార్లు ఢీ.. ఒకరు మృతి పలువురికి తీవ్ర గాయాలు

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి** రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలం వెల్జాల్ శివారులో మంగళవారం సాయంత్రం ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ఎదురెదురుగా రెండు కార్లు బలంగా ఢీ కొన్న ఘటనలో పలువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన ఏడుగురిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో శారదమ్మ అనే మహిళ మృతి చెందినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రూ.4.40 కోట్లతో బీటీ రోడ్డుకు 'వివేక్' శంకుస్థాపన





**గత సర్కార్ రూ. 8 లక్షల కోట్ల అప్పు మిగిల్చింది**

**కమీషన్ల కోసమే పనులు.. 43 వేల కోట్ల బిల్లులు పెండింగ్**

**ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోలేని వారికి నా వంతు సాయం**

**త్వరలోనే చెన్నూరుకు బస్ డిపో.. మంత్రి వివేక్ వెంకటస్వామి**

**భీమారం ఏప్రిల్ 28 (క్రైమ్ మిర్రర్)**

చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు.మంగళవారం భీమారం మండలం గెర్రెగూడెం నుంచి కాజీపల్లి వరకు (వయా నర్సింగాపూర్) సుమారు 4 కిలోమీటర్ల మేర నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఎస్డీఎఫ్ నిధులు రూ. 4.40 కోట్లతో ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి వివేక్ మాట్లాడుతూ"గత పదేళ్లలో కేసీఆర్ డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను నమ్మించి మోసం చేశారు.కానీ మా ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతున్నాయని, నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం" అని చెప్పారు.ఒకవేళ ఇందిరమ్మ ఇల్లు మంజూరై, ఆర్థిక స్థోమత లేక కట్టుకోలేకపోతే తన వంతుగా వ్యక్తిగత సహాయం అందిస్తానని, చెన్నూరులో ఇల్లు లేని పేదవాడు ఉండకూడదని ఆకాంక్షించారు.మిషన్ భగీరథ పేరుతో గత ప్రభుత్వం రూ.60 వేల కోట్లు ఖర్చు చేసినా,ఏ ఒక్క ఇంటికీ సరిగ్గా నీళ్లు ఇవ్వలేదని మంత్రి విమర్శించారు.కేవలం కమీషన్ల కోసమే పనులు చేశారని,అందుకే రూ. 43 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో పడ్డాయని మండిపడ్డారు.తెలంగాణపై రూ. 8 లక్షల కోట్ల అప్పుల భారం మోపారని ధ్వజమెత్తారు.నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడిని తీర్చడానికి ఇప్పటికే 400 బోర్లు వేశామని గుర్తుచేశారు.నియోజకవర్గ ప్రజల రవాణా కష్టాలు తీర్చేందుకు త్వరలోనే చెన్నూరుకు బస్ డిపోను తీసుకువస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. డిపో ద్వారా నిత్యం 60 బస్సులు నడుస్తాయని చెప్పారు. భీమారంలో పీహెచ్‌సీ అందుబాటులోకి తెచ్చామని,చెన్నూరులో ఏటీసీ సెంటర్ పనులు నడుస్తున్నాయని తెలిపారు. విదేశాల్లో ఉద్యోగాల కోసం చూసే యువతకు జర్మనీలో 50 వేల అవకాశాలు ఉన్నాయని,వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు.గ్రామాలను అభివృద్ధి చేస్తేనే సర్పంచ్‌లకు మంచి పేరు వస్తుందని, అందరూ కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు.

# ఎమ్మెల్యే బాలు నాయక్, మున్సిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ ఆధ్వర్యంలో కోఆప్షన్ సభ్యుల ఎన్నిక.....

**గార్లపాటి దామోదర్, నేతాల భాగ్యలక్ష్మి శ్రీనివాస్,**

**ఏకుల శిషోరమ్మ, మహమ్మద్ మంజూరు మైనుద్దీన్,లు**

**కో ఆప్షన్ సభ్యులుగాఎన్నిక...దేవరకొండ మునిసిపాలిటీ**

**అభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి చేస్తాం...**

**నూతనంగా ఎన్నికైన కో ఆప్షన్ సభ్యులు...**





**దేవరకొండ టౌన్ ఏప్రిల్ 28 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి....**

దేవరకొండ మునిసిపల్ నందు మంగళవారం రోజు మున్సిపల్ కో ఆప్షన్ ఎన్నిక కొరకు ప్రత్యేక సమావేశం మునిసిపల్ చైర్మన్ శ్రీమతి పున్న శైలజ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయబడినది. ఇట్టి సమావేశం నకు దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలునాయక్ ఆధ్వర్యంలో పురపాలక పరిపాలనలో ప్రత్యేక పరిజ్ఞానం లేదా అనుభవం కల్గిన సభ్యులుగా (కో ఆప్షన్ సభ్యులుగా) గార్లపాటి దమోదర్ మహిళా కేటగిరి నుండి నేతాల్ల భాగ్యలక్ష్మి , మైనారిటీ సముదాయానికి చెందిన సభ్యులు మహిళా వర్గం నుండి ,ఏకుల శిషోరమ్మ మైనారిటీ జనరల్ కేటగిరి నుండి , మొహమ్మద్ మంజూర్ మైనొద్దీన్ లను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఆప్షన్ సభ్యులు మాట్లాడుతూ.. దేవరకొండ మునిసిపాలిటీ అభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి చేస్తామని, ఎమ్మెల్యే బాలు నాయక్, మున్సిపల్ చైర్మన్, ల అడుగుజాడలలో మరియు కౌన్సిల్ సభ్యుల సహకారంతో దేవరకొండ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం పాటుపడతామని ఈ సందర్భంగా అన్నారు..





## డీజీపీ శివధర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఆసిఫ్ ఆలీ

**క్రైమ్ మిర్రర్, మిర్రర్ కల్వకుర్తి** మీర్ఖాన్ పెట్ ఫ్యూచర్ సిటీ ప్రాంగణంలో ఎఫ్ సి డీ ఏ నూతన సిటీ కమిషనరేట్ భవన ప్రారంభోత్సవానికి విచ్చేసిన తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డికి రేవంత్ మిత్రమండలి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ఆసిఫ్ ఆలీ, తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గుజ్జుల మహేష్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# మాదక ద్రవ్యాలు అమ్మితే కఠిన చర్యలు

**హుజూర్ నగర్ సీఐ**

**చరమంద రాజు**



**క్రైమ్ మిర్రర్, హుజూర్ నగర్** నిషేధిత మాదక ద్రవ్యాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హుజూర్ నగర్ సీఐ చరమంద రాజు హెచ్చరించారు.సూర్యపేట జిల్లా ఎస్పీ ఎన్.నరసింహ ఆదేశాల మేరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం హుజూర్నగర్ పట్టణంలోని యాంటీ డ్రగ్ అవేర్నెస్ లో భాగంగా హుజూర్ నగర్ పట్టణంలో ఉన్నటువంటి పాన్ షాపులు లలో తనిఖీలు చేసి నిషేధిత మాదకద్రవ్యాల అమ్మకములు చేసినట్లు అయితే చట్టరీత్యా చర్యలు తీసుకోబడును అని హెచ్చరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు.నిషేధిత మాదకద్రవ్యాల పైన అవగాహన కల్పించడం జరిగినది. మాదకద్రవ్యాల అలవాటుకు దూరం చేసి, తిరిగి సన్మార్గంలో నడిపించేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. మరోవైపు గంజాయి విక్రయాలు, అక్రమ రవాణా, వినియోగాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

## ట్రాన్స్ఫార్మర్ల మరమ్మత్తు కేంద్రాన్ని పరిశీలించిన విద్యుత్ సిఎండి జితేష్ వి పాటిల్



**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి నాగర్ కర్నూల్ జిల్లా** కల్వకుర్తి పట్టణం లోని 33/11 కేవీ సబ్ స్టేషన్ ట్రాన్స్ఫార్మర్తుల మరమ్మత్తుల కేంద్రాన్ని సంబంధిత అధికారులతో కలిసి తెలంగాణ సిఎండి జితేష్ వి.పాటిల్ మంగళవారం పరిశీలించారు. కల్వకుర్తి డివిజన్ పరిధి లో వివిధ విద్యుత్ అభివృద్ధి పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో సిబ్బందికి ఉన్నటువంటి ఇబ్బందులు తెలుసుకోవడానికి, కావలసినటువంటి పరికరాలు సమకూర్చడానికి క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్నామని చెప్పారు. ఆర్టిజన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో ఉండే సిబ్బంది కృషివల్లే విద్యుత్ సంస్థ అభివృద్ధి చెందుతుందని సిఎండి తెలిపారు.

## ఐసిడిఎస్ మరియు ఎస్ ఈ ఆర్ పి ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహన...




**చందంపేట టౌన్ ఏప్రిల్ 28 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి...**

మంగళవారం రోజు చందంపేట మండలం లో కిషోర బాలికల అవగాహన పై ఐసిడిఎస్.డఎస్ ఇ ఆర్ పి ఆధ్వర్యం లో సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించినారు,ఈ కార్యక్రమమునకు కిషోర బాలికల తల్లీ దండ్రులను ఆహ్వానించి అవగాహన సమావేశం ఏర్పాటు చేయనైనది ఇందులో కొన్ని విషయాలపై ఆరోగ్యం ,వ్యక్తి గత పరిశుభ్రత , సమత్తుల ఆహారం ,పీరియడ్ సమయం లో పరిశుభ్రత పాటించటం భద్రత పై మరియు కిషోర బాలికల సంఘాల అవసరం గురించే వారికీ వివరించటం జరిగింది..ఈ కార్యక్రమంలో వెలుగు ఏపి ఎం జయప్రసాద్, ఐసిడిఎస్ సూపర్వైజర్ సత్యకుమారి, సీసీలు , యాక్టివిస్ట్ సుజాత, మహిళలు పాల్గొన్నారు..

## అస్మిత ఖేలో ఇండియా బాలికల ఫుట్‌బాల్ సెమీస్ ముగింపు

**కరీంనగర్, రంగారెడ్డి జట్లు ఫైనల్‌లోకి**





**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 28:** అస్మిత ఖేలో ఇండియా అండర్-16 బాలికల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా మంగళవారం ఉదయం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లు ఆసక్తికరంగా సాగాయి. రెండు మైదానాల్లో జరిగిన పోటీల్లో కరీంనగర్,స్పోర్ట్స్ స్కూల్ రంగారెడ్డి జట్లు ఫైనల్‌కు అర్హత సాధించాయి.గ్రౌండ్ నంబర్-1లో జరిగిన తొలి సెమీఫైనల్ మ్యాచ్‌లో ఆదిలాబాద్‌పై కరీంనగర్ జట్టు 3-1 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. మ్యాచ్ మొత్తం కరీంనగర్ ఆటగాళ్లు ఆధిపత్యం చెలాయించి ఫైనల్‌కు దూసుకెళ్లారు.

గ్రౌండ్ నంబర్-2లో జరిగిన రెండో సెమీఫైనల్‌లో నిజామాబాద్, స్పోర్ట్స్ స్కూల్ రంగారెడ్డి జట్లు 1-1తో సమంగా నిలిచాయి.నిర్ణీత సమయంలో విజేత తేలకపోవడంతో మ్యాచ్ పెనాల్టీ షూటౌట్‌కు దారి తీసింది.ఉత్కంఠభరితంగా సాగిన షూటౌట్‌లో రంగారెడ్డి జట్టు 5-4తో గెలిచి ఫైనల్‌లోకి ప్రవేశించింది ఫైనల్‌లో కరీంనగర్,స్పోర్ట్స్ స్కూల్ రంగారెడ్డి జట్లు తలపడనున్నాయి.